# దాంపత్య ప్రసూనం

బుజ్జిగాడి ఒంటిమీద ఆత్రంగా చెయ్యి వేసింది, రమణి. "అమ్మో" అనుకుంది. జ్వరంతో కాలిపోతోంది వాడి ఒళ్లు. రమణి మనస్సు నిండా భయాందోళనలు కలగలుపుగా, రెండు రోజుల నుంచి తన ప్రాణానికి ప్రాణమైన బాబు, మూసిన కన్ను తెరవలేదు. అర్ధరాత్రైనా తెరిచిన రెప్ప వేయలేదు. అప్పుడే పదకొండు దాటింది. శ్రీవారు వచ్చేస్తే బావుండును. బాబు సంగతి తెలిసి కూడా ఇంటికి రాకుండా ఎలా ఉండగలుగుతున్నారో? "జ్వరమే కదా! తగ్గిపోతుంది" అనేస్తారు తేలికగా కానీ పరుగులు తీసే పసిడి మొగ్గల్ని అవిటి వాళ్లనిగా చేసే ప్రమాదకరమైన జ్వరం పోలియో అయి ఉంటుందేమో. రమణికి దుఃఖం ఆగలేదు. అలాగే జరిగితే తన కళ్ల ముందుగా చిందులేస్తున్న బాబు కుంటివాడై నడవలేకపోతే తల్లిగా తను " భగవంతుడా! అలా జరగనివ్వకు!" మనసులోనే ఎన్నో మొక్కులు మొక్కుకుంటూ తడీ గుడ్డతో బాబు ఒళ్లు తుడుస్తోంది.

"నాన్న ! నాన్న!" అని కలవరించాడు. "నాన్న వచ్చేస్తారు బుజ్జినాన్నా! అమ్మనీ, నీ దగ్గరే ఉన్నాగా, ఒకసారి కళ్లు విప్పి చూడవూ!" కళ్లు ఒత్తుకుంటూ భారంగా అంది, బుజ్జి నెమ్మదిగా కళ్లు తెరిచాడు. జ్వరం తగ్గు ముఖం పడుతోందేమో అనుకుంటూ ఒళ్లోకి తీసుకుంది. ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది. 'అమ్మా! ఆ' మరేమీ అనలేదు. "ఆ" అంటే ఆకలి అనుకుంది. మరుక్షణం పాల గ్లాసు తీసుకువచ్చి నెమ్మదిగా తాగించే ప్రయత్నం చేసింది అవి నోట్లోకి వెళ్లాయో లేదో భళ్లున వాంతి చేసుకున్నాడు. రమణి మాతృ హృదయం విలవిలలాడిపోయింది.

ఇలాంటి మహా నగరాల్లో ఇరుగు పొరుగు ఎవరికి వారే అన్నట్లుండే చోట పసి పిల్లలతో ఉండడం కష్టమే అనుకుంది. అయినా తను ఈ ఊరు వచ్చి నాలుగు రోజులేగా అయింది.

ఎవరితో అయినా పరిచయం పెరగడానికి టైమెక్కడ? తనేమో ఒంటరితనం భరించలేకపోతుంది.

"అమ్మా!" అని బుజ్జిగాడు పిలిచేసరికి "ఇక్కడే ఉన్నాను నాన్నా ఏం కావాలి?" అంది.

"నేనెప్పుడాడుకుంటాను!" రమణికి నవ్వొచ్చింది. ఆకలి అన్నాడనుకొంది తను. పసి హృదయం, వాళ్లు ఏ స్థితిలో ఉన్నా ఆటపాటలే కోరుకునే ప్రాయం ఇది. "ఆడుకుందాం నాన్నా రేపు ఎంచక్కా ఈ జ్వరం తగ్గిపోతుంది. నువ్వు నేను దొంగాటలు, దాగుడుమూతలు అన్నీ ఆడుకుందాం" అంది లాలనగా.

గడియారం పన్నెండు గంటలు కొడుతుంటే వచ్చాడు రాజేశ్, బేలగా అతని భుజం మీద ఒరిగిపోయి బావురుమంది. బాబు జ్వరం ముందుంచింది "పిచ్చి రమణీ, ఇంత చదువు చదువుకుని ఇలా అయిపోతే ఎలా? ఇప్పుడేం కాలేదుగా? నిన్ను పిల్లల్ని ఇక్కడికి తీసుకువచ్చే ముందే మన పక్క వీధిలోనే మంచి చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ ఉన్నారని తెలుసుకున్నాను . పోనీ నువ్వెందుకంటున్నావో బుజ్జిగాడ్ని ఇప్పుడే తీసుకెళ్తాలే..."

" నేనూ వచ్చేస్తానండి..."

"అదిగో మళ్లీ! " పావనిని ఎవరు చూస్తారండీ ? ఓ అరగంటలో వచ్చేయమూ."

బుజ్జిగాడ్ని ఎత్తుకొని బయలుదేరాడు. రమణి ఎమ్. ఎస్. సి చేసిందని, ఉద్యోగం కూడా చేస్తోంది అని పెళ్లి చూపుల్లో తను వేరే రకంగా ఊహించుకున్నాడు. ఇంటిని, తనకి పుట్టబోయే పిల్లల్ని ఎలా చూస్తుంది? చదువుకున్న దర్పం, ఉద్యోగస్తురాలన్న అహం రవ్వంతైనా ఉండకపోతుందా? ఇల్లు దిద్దుకొని పిల్లల్ని ప్రేమగా సాకే ఇల్లాలు కావాలి తనకి. ఆమాటే తల్లితో అంటే ఆమె నవ్వేసింది. "లేదురా... ఈ అమ్మాయి మా అందరికీ నచ్చింది. నీకూ నచ్చింది. కానీ ఊరికే పిచ్చి ఆలోచనలు పెట్టుకుంటున్నావ్ అంతే..." అని సర్దిచెప్పింది. అమ్మ మాటే అక్షర సత్యమైంది.

బాబు కడుపున పడగా ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేసింది. తను, పిల్లలు రమణికి ప్రాణాధికం ఎవరైనా నీ చదువుకి సార్థకత ఏమిటి అంటే "అది ఒక్క ఉద్యోగంతోనే కాదు. ఎవరైనా నా సహాయం కోరితే వాళ్లకి నేర్పడంలోనే తృప్తిపొందుతాను" అని అంటుంది. నిండు మనస్సుతో అలాంటి సహచరి దొరకడం తన అదృష్టంకాదూ!

ఆలోచిస్తూనే డాక్టర్ గారి ఇంటి గేటు తెరచుకుని లోపలికి వెళ్లాడు. ' డాక్టర్ రమేష్, చిల్డ్రన్ స్పెషలిస్ట్' అనే బోర్డు చూసి తృప్తిగా నిట్టూర్చాడు. " అమ్మయ్య! బాబుకి ఇక పరవాలేదు. తనకి నైట్ డ్యూటీ అయి ఉండకపోతే రమణి ఇంత భయపడవలసి వచ్చేది కాదు. సాయంత్రమే తీసుకొచ్చేసేవాడు.' అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడు.

ఆ మోతకి రమ్య మేల్కొంది రాజేష్‌ని చూసి అదే పనిగా మొరుగుతోంది కుక్క రమ్యకి చెప్పలేనంత చిరాకు, విసుగు కలిగాయి. " ఏమిటి రాజేష్ నీ గోల! వచ్చిని వాళ్లు దొంగలైతే

కాలింగ్ బెల్ నొక్కరురా." రాజేష్ ఉలిక్కిపడ్డాడు. తన పేరే ఈ ఇంటి కుక్కదన్నమాట.

తలుపు తెరుచుకుని రమ్య బయటకు వచ్చేసరికి అతను మరింతగా ఆశ్చర్యపోయాడు.

ఆమె కూడా అదే స్థితిలో ఉండిపోయింది.

"నువ్వు!"

"ఔను - నేను రాజేష్‌నే. ఇప్పుడు డాక్టర్ గారితో పని ఉండి వచ్చాను. చూస్తున్నారుగా నా భుజాన పసివాణ్ణి, తొందరగా డాక్టరుగారిని పిలవండి."" అది సరే ఎలా ఉంటున్నారు ! ఏమిటి, మీ సంగతులు చెప్పండి."

"అది అప్రస్తుతం. నేను వచ్చింది డాక్టరుగారితో పని ఉండి. దయచేసి వారిని పిలవండి." బాబుని భుజం మార్చుకుంటూ అన్నాడు.

" అలాగా పనులు చక్కపెట్టుకోవలసింది పగటి సమయం సార్ ! డాక్టరు గారు నిద్రలో ఉన్నారు" అంటూ వెటకరించింది. అప్పటికే మెలకువ వచ్చిన రమేష్ తనే బయటికి వస్తూ - "రమ్యా ! ఎవరో వచ్చినట్లున్నారు. చెప్పావు కాదేం?" అన్నాడు. రమ్య మౌనంగా లోపలికి వెళ్లిపోయింది.

రమేష్ కంట పేషంట్ పడడమే తడవు. పగలు, రాత్రి తేడా చూడడు. తిండీ, తిప్పలు పట్టించుకోడు. ట్రీట్‌మెంట్ మొదలు పెట్టేయవలసిందే. అదే రమ్య సహించలేని విషయం. మాట్లాడితే వృత్తి ధర్మం, అపద్ధర్మం అంటూ ధర్మపన్నాలు మొదలెడతారు.

అతని అంతరంగం తెలియకుండానే పెళ్లి చేసుకుంది. డాక్టర్ చదివి ఇల్లరికం వస్తానంటున్నాడంటే తన సంపదపైన వ్యామోహం అనుకుంది. తను చెప్పు చేతలలో ఉండి డబ్బుతో వచ్చే సర్వ సౌఖ్యాలు, సంఘంలో హోదా పొందుతూ ఆస్తిని రెట్టింపు చేస్తాడనుకుంది. కానీ అతని అభిప్రాయాలే వేరు. "మనకి భగవంతుడు సిరిసంపదలనిచ్చింది మనం కష్టపడి చదువు సంధ్యలు ఆర్జించింది అన్నీ సాటి మనుషులకు సాయపడడం కోసమే" అంటూ ఇంట్లోనే క్లినిక్ మొదలు పెట్టాడు. విసుగు, విరామం అతనికి లేదు. సరే, తన ముద్దూ, ముచ్చటా చూడాలి కదా. ఛా, తను మోసపోయింది. పెళ్లికి ముందు రాజేష్ ఒక రకంగా అవమానిస్తే, ఇప్పుడితను ఇలా తనని వేధిస్తున్నాడు. తన సరదాలు, కోరికలు అన్నింటికీ కళ్లెం వేశాడు. కాలేజీలో చదివే రోజులు, రాజేష్‌తో తన పరిచయం అన్నీ ఆమె కళ్ల ముందు సినిమా రీళ్లలాగా తిరుగసాగాయి.

బాబుకి ఇంజక్షన్ ఇచ్చి రాజేష్‌కి ధైర్యం చెప్పాడు రమేష్. "జ్వర తీవ్రత తప్ప మీ పిల్లాడికి ఇంకేం లేదు. తగ్గిపోతుంది. ఒక్క పది నిముషాలు కూర్చుని వెళ్లండి."

"అలాగే సార్ ! చాలా రాత్రి వేళ శ్రమ తీసుకున్నారు. థాంక్స్ సార్, థాంక్ యూ !"

"నేనెప్పుడూ దీనిని శ్రమగా భావించను... ఇలా చేయగలిగినప్పుడే కదా నా సేవా ధర్మాన్ని

నేను నిర్వర్తించిన వాడినవుతాను. ఇంకా నేను చెయ్యవలసింది ఎంతో మిగిలిపోయింది. అందరికీ అన్నింటా పరిస్థితులను కూలించవు."

రమ్య తత్వం తెలుసు కనుక రాజేష్‌కి విషయం బోధపడి పోయింది.

"అలా అనేయకండి సార్... మీ దయవల్లనేగా ఇప్పుడు మా బాబు కోలుకుంటున్నది. ఎందరి అనారోగ్యాన్ని ఇట్టే మాయం చేశారో, మరెందరికి ప్రాణభిక్ష పెట్టారో, మీకు గుర్తుండకపోయినా పొందిన వాళ్లు మరచిపోలేరుగా." ఆ మాటా, ఈ మాటా చెబుతూ - ఆ పది నిముషాలలోనే రమేష్‌కి, రాజేష్ ఎంతో సన్నిహితుడైపోయడు. అభిరుచులు కలియకపోయాక చెయ్యగలిగేది ఏమీ లేదు.

"మావి భిన్న దృక్పథాలు" అంటున్న రమేష్ ముఖంలో ఆవేదన దట్టంగా అలుముకుంది. " వస్తా సార్ ! ఏవేవో కదిపి మీ మనసుకి కష్టం కలిగించానేమో !" బుజ్జిగాడ్ని ఎత్తుకుని లేచాడు.

కొడుకుని చూశాక రమణి మనసు తేలికపడింది. పాపని భర్త పక్కలో పడుకోబెట్టి బుజ్జిగాడ్ని తన హృదయంలో దాచుకుని నిద్రలోనికి జారుకుంది. అమాయకంగా ఆదమరచి నిద్రపోతున్న భార్య ముఖంలోకి ఆత్మీయంగా చూసుకున్నాడు. తనెలా అయినా అదృష్టవంతుడు. కాకపోతే అప్పట్లో రమ్య తనని ఎంత ప్రలోభపెట్టింది. అప్పుడే ఆమెకు లొంగిపోయి ఉంటే రమేష్ స్థానంలో తను అమ్మో! రమేష్ తన ఆశయాలకు సమాధికట్టినట్లే తన విషయంలోనూ అంతే జరిగేది. అతని కళ్ల ముందు గతం నీడలు...

కాలేజీల్లో రమ్య ఎంత అహంకారం చూపించేదనీ ! అందర్నీ తనే ఆకర్షించాలి. అందరి మెచ్చుకోలూ తనకే లభించాలి. సిరిసంపదల్లో తప్ప మరెందులోనూ సాటి విద్యార్థినులతో పోటీపడలేని రమ్య, తనకన్నా అందంగా ఉన్నవాళ్లని, కళల్లోనూ, చదువులోనూ ముందంజ వేస్తున్న వాళ్లని చూసి ఈర్ష్య పెంచుకునేది. చాలా మంది తమ తమ అవసరాలు తీర్చుకోవడం కోసం స్నేహం పేరు మీద రమ్యను పొగుడుతూ వెంట, వెంట తిరిగేవారు. కానీ రమ్య ఎందుకో తనను కోరుకుంది. తన తెలివితేటలు, చాకచక్యం చూసి కొంగున కట్టేసుకోవాలనుకుంది. ఆ రోజు తనెంత తప్పించుకున్నా ఇంటికి తీసుకువెళ్లి ఎంతగోముగా తనని వాంఛించిందీ ! ఎంత అధికారంతో శాసించబోయిందీ !

తనప్పుడే సూటిగా చెప్పాడు. అలా చెప్పగలిగాడు కనుకను ఇప్పుడు బ్రతికిపోయాడు.

"చూడు రమ్యా ! పెళ్లి అనేది నూరేళ్ల పంట. ఒకరికున్న డబ్బు, మరొకరికున్న తెలివితేటలు కలిపి ఆడుకునే బంతులాట కాదు జీవితం. మన అభిప్రాయాలు కలియవు. నీ కోరికలకీ, నా అభిరుచులకీ పొంతన కుదరదు" అని చెప్పేశాడు.

రమ్య మండిపడింది, తన మాటలకి, "ఔను అదృష్టదేవత అందలమెక్కిస్తే బుద్ధి

బురదలోకి లాగుతుంది మరి. అందం, ఐశ్వర్యం నీ స్వంతం చేస్తానంటే ఆనందంగా జీవితాన్ని అనుభవిద్దాం రమ్మంటే, నేనేదో పెద్ద నేరం చేస్తున్నట్లు పాఠాలు చెబుతున్నావు. నా పెంపుడు కుక్కపాటి లేదు నీ బ్రతుకు'' అంది.

అహంకారంతో అనాడు రమ్య అన్నమాటలు ఇప్పటికీ తన చెవులలో గింగురుమంటున్నాయి. ఏది ఏమైనా తనా వలలో చిక్కుకోలేదు. ఆ బంగారు పంజరంలో చిలుక కాలేదు. తను కోరుకున్న గమ్యం చేరుకోగలిగాడు. రమణిని సహచరిగా పొంది ప్రశాంత జీవనాన్ని సాగించగలుగుతున్నాడు ప్రేమగా ఆర్ద్రంగా చుట్టూ చేయివేశాడు.

ఆ రాత్రి రమ్యకి నిద్ర కరువైంది. రాజేష్ రూపమే ఆమె కళ్లల్లో మెదులుతుంది. 'కండలు తిరిగిన శరీరం, కవ్వించే అందమయిన కళ్లు ఓహ్ ! రాజేష్ ఎంతటి అందగాడని ! తనకి దక్కకుండా పోయాడు. ఎంత నిర్లక్ష్యం ! మూర్తీభవించిన గర్వం కాకపోతే తనను అలా తృణీకరించడం. రాజేష్‌ని తన తండ్రి కూడా ఇష్టపడ్డాడు. కానీ తననీ, తన ప్రేమనీ తిరస్కరించి రాజేష్ వెళ్లిపోయినా తను మాత్రం అతని వలన షాక్ తిన్నది. ఇంతకీ ఆతను కోరుకున్న ఇల్లాలు ఎలాంటిదో అడుగులకి మడుగులొత్తుతుంది కాబోలు. ఎన్ని సుఖాలు అనుభవించేస్తున్నాడో !' కసిగా అనుకుంది. 'ఊళ్లోనే ఉంటున్నాడుగా, చూడాలి రాజేష్ సంసారాన్ని బ్రతకడానికి డబ్బుతో పనిలేదని, లక్షలనే నిర్లక్ష్యం చేసి తనని కాదని కట్టుకున్నాడు కాబోలు ఓ సుగుణాల రాశిని, ఏది ఏమైనా రేపే రాజేష్ ఇంటికి వెళ్లాలి.' రాజేష్‌ని అతని భార్య ఎలా మురిపిస్తున్నదో, ఏ సౌఖ్యాలు అందిస్తుందో తెలుసుకునేదాకా రమ్య మనసు నిలవడం లేదు.

బుజ్జిగాడు అటూ, ఇటూ తిరిగి ఆడుకుంటూ గిలక్కాయలతో చెల్లాయిని ఆడిస్తుంటే ఆ రోజు పండుగలా ఉంది రమణికి. పిడుగు పాటులా హడలగొట్టిన పీడ జ్వరం మాయమైంది. బాబు మళ్లీ కనువిందుగా పరుగులు తీస్తున్నాడు. ''అమ్మా! అప్పచ్చులు చేస్తావా?'' అంటూ మారాం చేస్తున్నాడు. ''చేస్తాను బాబూ ! నీకు జ్వరం తగ్గిపోయిందిగా ఎంచక్కా తింటూ ఆడుకుందువుగాని'' బాబుకి ఇప్పుడు రుచించే విధంగా ఏం తయారు చేస్తే బాగుంటుంది అని ఆలోచిస్తే వంటింట్లోకి వెళ్లింది.

కాలింగ్ బెల్ మోగడంతో పిండి జల్లెడ పక్కన పెట్టి వెళ్లి తలుపు తెరిచింది. వచ్చిన ఆమెను చూస్తూ ''రండి కూర్చోండి'' లోపలికి ఆహ్వానించింది.

'' రాజేష్‌గారి ఇల్లు ఇదేనా!'' కుర్చీలో కూర్చుంటూ అడిగిందావిడ.

రెండు గదులు, చిన్న ఇల్లు, పెద్దగా ఫర్నిచర్ ఏమీ లేదు. ఓ నాలుగు కుర్చీలు, టేబులు, ఒక్క బీరువా. ఆ గదిలోనే ఉయ్యాల ఉంది. ఉయ్యాలలో పాప కేరింతలు కొడుతూ ఆడుకుంటుంది.

'' ఎవరు కావాలి. రాజేష్‌గారు మావారే'' ఇంటిని పరిశీలిస్తున్న ఆమెతో రమణి అన్నది.

మనిషి అందంగానే ఉన్నా అలంకరించుకోవాలన్న ధ్యాస లేనట్లుందీవిడకి. కట్టిన చీర నలిగి కాస్త మాసింది. చెమటతో చెదరిన కుంకుమ నుదురంతా అలుముకుంది. వంటింట్లో ఏదో పని చేస్తోంది కాబోలు. ఈమేనన్న మాట ఆ మహానుభావుడి మనస్సుదోచేసిన మగువ. భార్య అనుకూలవతి అంటే ఇలా అలుకు గుడ్డలతో, చింపిరి జుట్టుతో వంటింట్లో పడిగాపులు పడడం కాబోలు.

"ఏమిటాలోచిస్తున్నారు . ఎండపడివచ్చారు. ఉండండి. చల్లని మజ్జిగ తీసుకువస్తాను." రమణి వంటింట్లోకి వెళ్లింది.

రమ్య ఆలోచనల్లో ఓ వింత వైఖరి పొడసూపింది. రాజేష్ సంగతి ఈమెకు చెప్పాలి. దైవ స్వరూపంగా భావిస్తున్న భర్త అంటే అసహ్యం, ఓ విధమైన అలుసు ఏర్పడేట్లు చేయాలి. తన ఇల్లు ఏదో మమతల పందిరని తన సతీమణి అనురాగ దేవత అని తెగమురిసిపోతున్నాడు.

అవన్నీ ఎంత వరకు ? ఆడదాని మనస్సు తనకి తెలియదా ? తనూ ఆడదేగా ! ఒక్క చిన్న మాట రాజేష్‌ని గురించి తన నోట విన్నదా ముక్కలైపోతుంది ఆమె మనస్సు ఒక అశాంతి మందిరమే ఈ ఇల్లు. తను జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో పొరపాటు చేశానని, పప్పులో కాలేశానని రాజేష్ ఆవేదన పడవలసిందే ! రమ్యనే చేసుకుని ఉంటే తన జీవితం సుఖంగా సాగిపోయేది అనుకునే స్థితికి కూడా వస్తాడు.

"ఇంతకీ మీ పేరే చెప్పారు కాదు." నల్లని కుండలోని చల్లని నీటితో మజ్జిగ తేట కలిపి తెచ్చిన గ్లాసు రమ్య చేతికి అందించింది. మళ్లీ ఆమె ఆలోచనలకు ఆనకట్టవేసింది రమణి.

"నా పేరు రమ్య."

"రమ్యా!"

"ఔను రమ్యనే ! మిమ్మల్ని చూడాలని వచ్చాను."

"ఓ అంతకన్నానా ! ఒట్టి చూపులే ఏమిటి ! మనం స్నేహితురాళ్లమే అయిపోదాం" రమ్య పక్కనే ఉన్న కుర్చీలో తనూ కూర్చుంటూ కరచాలనం చేసింది.

"మీది ఇంత అమాయకపు స్వభావం కనుకనే రాజేష్ నాటకాలు సాగిపోతున్నాయి" అనేసి నాలుక కరుచుకున్నట్లు నటించింది.

"ఓ సారీ!"

"అనవసరంగా మాట జారానేమో !"

రమణి నవ్వి ఊరుకుంది.

ఆ మాటకే ఆమె ముఖంలో రంగులు మారిపోతాయని " మీకు తెలిసిన విషయం దాచకుండా చెప్పండి ప్లీజ్" అని చేతులు పట్టుకుని బ్రతిమాలుతుందని ఊహించిన రమ్యకి ఏం చెయ్యాలో పాలుపోలేదు.

రమణి మాత్రం అదేం పట్టనట్లు మామూలు ధోరణిలో ఏవేవో మాట్లాడేస్తోంది. " అన్నట్లు మా పాపాయిని చూశారా?" అంది. ఉయ్యాలలో ఆడుకుంటున్న పాపని అంతా రాజేష్ పోలికే కన్ను ముక్కు తీరు నవ్వితే సొట్టలుపడే అందమైన చెక్కిళ్లు. రాజేష్ అదృష్టవంతుడు అనుకోకుండా ఉండలేకపోయింది.

"ఎక్స్‌క్యూజ్ మీ మీకు అలవాటు లేదేమో" అంటూ పాపాయిని తిరిగి తీసుకుంది.

"అలవాటు సంగతి కాదులెండి మిమ్మల్ని చూస్తుంటేనే బాధగా ఉంది."

" నా గురించి బాధపడడమేమిటండి. ఇప్పుడు నాకేం తక్కువ కాలేదే."

" అందుకే అంటున్నాను మీరు అమాయకులని."

" అంత అమాయకత్వాన్ని నాలో ఏం చూస్తున్నారో నాకు అర్థంకావడం లేదు."

"నేను చెప్పే విషయం వింటే మిమ్మల్ని అలా ఎందుకంటున్నానో తెలుసుకోగలరు."

అప్పటికైనా రమణి కుతూహలపడుతుందని ఆశించింది రమ్య.

"పోనీ ఆ విషయమేమిటో చెప్పండి. దాచుకుని మీలో మీరు మథనపడడం దేనికి?"

తను ఆశించిన మార్పు కలుగుతుందేమో రమణిలో, అనుకున్న రమ్య వేడి నిట్టూర్పు విడిచి చెప్పడం ప్రారంభించింది.

" మీ వారు మిమ్మల్ని వంచించాడు. ఆయన దృష్టిలో మీరు వంటింటికి అంకితమైపోయి తన పిల్లల్ని కని పెంచే యంత్రం. భార్య అంటే అంతేనట. ఆమెకు అంతకన్నా విలువ ఇవ్వవలసిన అవసరంలేదు అని నాతో చాలాసార్లన్నాడు."

"రాజేష్ మీ కెలా పరిచయం అయ్యారు?"

"అదే చెప్తాను. కాలేజీలో చదివే రోజుల్లోనే నా మీద, మా ఆస్తి మీద కన్నేసిన ఘనుడు. ఆఫ్‌కోర్స్ ఆడదంటే అతనికున్న అభిప్రాయాన్ని బట్టి మా ప్రేమ పెళ్లి దాకా రానివ్వలేదు నేను."

రమ్య ఇలా చిలువలు పలువలు చేర్చి రమణిలో అనక్తిని గమనించకుండానే చెప్పుకుపోతోంది.

" నా కోసం మా ఇంటి ముందు కుక్కలా తిరిగేవాడు."

"అందుకేగా మీ కుక్కకి ఆయన పేరు పెట్టుకుంది!"

రమ్య ఆదిరిపడింది.

" నాకు అంతా తెలుసు రమ్యా ! మీ ఇద్దరి మధ్యా జరిగిన కథంతా వారు మా మొదటి రాత్రే చెప్పారు !"

"రమ్యకి వ్యతిరేకమైన లక్షణాలు నీలో ఉన్నాయని ఆశిస్తున్నాను. నా ఆశయాలను ఎలా పండిస్తావో మరి" అన్నారు. పాపం ! మీరు చాలా శ్రమ తీసుకుని అలసిపోయారు. మా భార్యాభర్తల మధ్య మీరాశించినట్లు కలతలు సృష్టించడం సాధ్యంకాదు. మాలో మాకు అరమరికలుంటేగా ! మీరు చాలాసేపు మాట్లాడారు. ఇక నేను చెప్పేది కూడా వినండి.

"దాంపత్య ప్రసూనం ప్రతి రేకూ వికసించాలంటే దంపతుల మధ్య ఒక అవగాహన ఉండాలి. ఒకరి అభిప్రాయాలకి వేరొకరు విలువనివ్వాలి. ప్రేమ, స్నేహం, అనుబంధం, ఆపేక్ష, మమత, ఆకర్షణ ఇవన్నీ ప్రసూనానికి రేకులు. ఏ రేకు వికసించకపోయినా నిండుదనం రాదు. రమేష్‌గారు మా వారితో అన్న రెండు మాటల్లోనే మీ దాంపత్య ప్రసూనం ముకుళితమయ్యే ఉందని నేను అర్థం చేసుకోగలిగాను. గతం గతః వదిలేద్దాం. ఇకనైనా మీ వైఖరి మార్చుకుని మీ దాంపద్య ప్రసూనాన్ని వికసించనివ్వండి. సహచరిగా మీరు భర్తని కేవలం డబ్బుతోనే ఆకట్టుకోవాలనుకోవడం మూర్ఖత్వం కాదా! ఇలాంటి విషయాలు ఒకరికొకరు ఉపదేశించుకునేవి కావు. మీరే సాలోచనగా మీ కర్తవ్యాన్ని గుర్తించండి. మీవారైనందుకు రమేష్ గారిని అర్థం చేసుకుని సుఖపెట్టండి."

రమ్యలో ఏ మోస్తరు భావాలు చెలరేగుతున్నదీ గమనించదలుచుకోలే రమణి. తన వంతు పని తను చేసింది.

అపై అమె ఇష్టం ఆమెది. కుర్చీలో నుండి లేచి వంటింట్లోకి వెళుతూ ఒకసారి రమ్యను చూసింది.

"నే నిచ్చిన చల్లని మజ్జిగ మీరు తీసుకోనేలేదు. బహుశా నా అతిథ్యం నచ్చినట్లు లేదు మీకు. తలనొప్పి తెప్పించానేమో ! వేడి టీ తీసుకొస్తాను ఉండండి."

రమణి వేడి టీ కప్పులతో తిరిగి వచ్చేసరికి రమ్య కూర్చున్న కుర్చీ ఖాళీగా ఉంది. ఆమె ఊహించినట్టే జరిగింది.

తన మనస్సు సుమనస్సుగా మిగిలి తమ దాంపత్య ప్రసూనానికి ఏ రేకూ వడలిపోకుండా ఉంటే చాలు అనుకుని తృప్తిగా నిట్టూర్చింది.

*డిసెంబర్ 9, 1992 ఆంధ్రప్రభ వారపత్రిక* ❑